# తప్పెవరిది?



'నీలిమ'

దూరాన ఫాక్టరీ సైరన్ మోగింది, 6 గంటలయింది అని సూచిస్తూ. పడమట ఆకాశాన్ని రక్తసిక్తం చేసిన సూర్యుడు, చేసినపనికి సిగ్గుపడి కొండల చాటుకు తప్పుకున్నాడు. సంధ్య చీకట్లు అలుముకుంటున్నవేళ మాకుమాత్రం ఏం పని అని పక్షులు ఆ రోజు అనుభవాలను ఒకదానికి ఒకటి కిలకిలారావాలతో చెప్పుకుంటూ ప్రొద్దున వదిలిన గూడు చేరుకోను పయనం సాగించాయి. రోజూలాగానే, ఆ రోడ్డు, అప్పటివరకు నిర్మానుష్యంగా పడివున్నది, మనుష్యుల గాలిసోకి తృప్తిగా నిట్టూర్చింది. అవును మరి, నగరానికి సుదూరాన కట్టబడిన ఆ యింటికి ఎవరు వస్తారా? వచ్చినా, ఆ మూసిన తలుపులను చూసి ముఖం చిట్లించుకొని వెళ్ళిపోతారేమో గాని యింట్లోకి వెడతారా?

వచ్చిన యిద్దరు వ్యక్తులు ఆ యింటిలోకి నడిచారు. గేటు దాటిన తరువాత పది అడుగులు వెడల్పుఉన్న బాట. బాట కిరువైపులా తోట. గేటుకి సుమారుగా వంద అడుగుల దూరంలో కొత్త పద్ధతులతో అధునాతనంగా కట్టబడిన ముచ్చటయిన యిల్లది. ఒక వ్యక్తి వాకిలి తలుపు చేరుకోడానికి ఉన్న ఐదు మెట్లను ఎక్కి బజర్‌పై వేలు వేస్తూండగానే తలుపు తెరుచుకుంది.

"నమస్తే ప్రొఫెసర్. రండి లోపలికి. ఇప్పుడే తోటపని పూర్తికానిచ్చి లోపలికొచ్చా" ముఖంపై చిరునవ్వుతో, ఆకర్షణీయంగా ఉన్న ప్రొఫెసర్ సంఘమిత్ర వారిద్దరిని ఆహ్వానించాడు.

"నమస్కారం ప్రొఫెసర్‌గారూ," చిరునవ్వుతో బదులిస్తూ లోపలికి నడిచారు ప్రశాంత్, కుమార్‌లు.

వరండా దాటిన తరువాత డ్రాయింగ్ రూమ్. రూమ్ మొత్తం నేలపై ఒత్తుగా ఉన్న ఖరీదైన కార్పెట్. మధ్యలో నల్లటి సోఫాసెట్. రూంకి కుడివైపున మూలగా రెఫ్రిజిరేటర్, ఎడంవైపున మూలగా రేడియోగ్రామ్, వీటి రెంటికీ

మధ్య తోపలికి వెళ్ళేందుకు రెండు తలుపులు. తలుపులకి, కిటికీలకు రోజ్ కలర్ కర్టెన్స్ ఒక పక్కకి లాగబడి ఉన్నాయి. టేబిల్ పై కొన్ని మాగజైన్స్, ఓ ఫ్లవర్ వేజ్, దానిలో విరిసీవిరియని గులాబులు అందంగా అమర్చిఉన్నాయి.

"కూర్చోండి ఫ్రెండ్స్. ఆఁ. ఏవిటి విశేషాలు? మళ్ళీ మొహాలు కొద్దిగా వడలి వున్నాయే? కాలేజీలో ఏమన్నా...." సంఘమిత్ర కళ్ళలో చిలిపినవ్వు.

"ఆఁ ఏం కాలేజీ సార్. అసలు మాకు ఒక్కొక్కసారి అనుమానం వస్తూ ఉంటుంది ఎవరు ఎవరికి బోధిస్తున్నారు అని. ఆ రోజులు పోయినాయి, గాన్ ఫరెవర్. ఇక్కడ స్టూడెంట్స్‌కి కొద్దిగా మన తరహా రుచింపకపోయినా బయటకెళ్ళిపోతారు. అదేం అంటే, గొడవ, ప్రిన్సిపాల్ నుండి మెమో! ఏదో బ్రతకాలి కాబట్టి గాని, ఈ వుద్యోగానికి ఎప్పుడో రాజీనామా యిచ్చేవాడివి" ప్రశాంత్ ఆ రోజు చీకాకంతా మాటల్లో ధ్వనింపజేశాడు.

"ఆగండి ఆగండి! ఇటువంటివి తట్టుకోవాలండీ. అయినా, మీకు బాగా చెప్పడం వస్తే వాళ్ళననవలసిన పరిస్థితి రాదు. స్టూడెంట్స్‌ని ఎలా ఆకట్టుకోవాలో తెలుసుకోవాలి మీరు. ఆ జ్ఞానం సంపాదించిననాడే మీరు నిజమైన లెక్చరర్స్" ప్రశాంత్‌ని ఉడికించాడు సంఘమిత్ర.

"మహా బాగా చెప్పారు సార్. అయినా ఓ రోజు క్లాస్ తీసుకొని ఆ తరువాత యిలా వాదించండి. అప్పుడు మీరు నిజంగా గొప్పవారు. వాదన అంటే గుర్తొచ్చింది, ఏమైంది నిన్నటి ఆర్గుమెంట్? ఏమన్నా మార్చుకున్నారా మీ అభిప్రాయాలను" కుమార్ సంఘమిత్రని అడిగాడు.

తృటిలో గంభీరత ప్రత్యక్షమయింది సంఘమిత్ర మొహంలో "నో. నా అభిప్రాయం మార్చుకోను. అయినా, నే చెప్పిన పాయింట్‌లో. ఉన్న సటల్‌టీ మీకు అర్థంగావడం లేదనుకుంటాను."

కుమార్ తల ఆవేశంగా ఊపాడు. "అదే మా అభిప్రాయం కూడా. మా వాదనని మీరు అసలు వినడంలేదు. ఒక రచయిత ఒక రచనచేశాడూ అంటే, వెనకాల అతనికి తెలిసో తెలియకో అతనివి ప్రేరేపించిన సంఘటన ఉండి ఉంటుంది. సబ్‌కాన్షస్‌నుండి వెలువడినప్పుడు, అది అతనిచే మలచబడి బ్రహ్మాండమైన రచన అవుతుంది. అవి చిన్నప్పటి జ్ఞాపకాలు కావచ్చు మరేమైనా కావచ్చు. కాని అవి బయటికొచ్చినపుడు అతను మనకు సమాజాన్ని కళ్ళకి కట్టినట్లు చూపెడుతున్నాడు. అందరం ఎన్నో చూస్తాం కానీ, అందులో ఏవన్నా సిగ్నిఫికెన్స్ వుందా అని ఆలోచించం. అటువంటి ఇన్‌సైట్ మనకు ప్రసాదించే రచయితకి సమాజం ఎన్ని స్వాతంత్ర్యాలయినా

ఇవ్వవచ్చు. అతను మనష్యుల పై ప్రయోగాలు కూడా చెయ్యవచ్చు."


సంఘమిత్ర చెక్కు చెదరలేదు. "మీకు నేనన్న పాయింట్ అర్థం కావడంలేదు. నిజమే, రచయిత మనకి ప్రసాదించేది అమూల్యం. దానికై అతని జీవితం ఆనందంగా గడిచి పోడానికి కావలసిన పారితోషికం యిద్దాం. అంతేగాని అతను మనుష్యుల మనస్తత్వాలతో ఆటలాడే సాహసం చెయ్య కూడదు."

ప్రశాంత్ గొంతు సవరించుకున్నాడు. "నా ఉద్దేశ్యం, మీరు అక్కడ సమస్యని ఒక కోణంనుండి చూసి ఇదే సమస్య అని సమాధానం వెతుకుతున్నారు. నిన్నటి కథ తీసుకోండి. ఓ అమాయకురాలు భర్త చేతుల్లో కష్టాలు పడుతోంది. గమనించిన రచయిత చెయ్యి ఊరుకోదు. ఆ అమాయకురాలి కథని మనసులకు పట్టినట్లు వ్రాస్తే కొందరిలో అన్నా పరివర్తన వచ్చే ఆశ ఉన్నది కదా! ఒకమ్మాయి కథ వ్రాసినంత మాత్రాన ఆ అమ్మాయి ప్రైవసీకి దెబ్బకాదు. ఆ అమ్మాయి వచ్చి రచయితను "నా కథెందుకు వ్రాశారూ" అని నిలదీస్తే, ఆ అమ్మాయి వెర్రితనం కాని, రచయిత తప్పుదారి పట్టాడని కాదు. పోనీ, మీరు చెప్పినట్టు ఆ అమ్మాయి భర్త ఆ కథ చదివి ఆ అమ్మాయి జీవితాన్ని మరింత నరకం చేశాడనుకొందాం. అమ్మాయి అది భరించలేక ఆత్మహత్య చేసుకుంది. కాని, ఒక్క ప్రాణంపోయినా సమాజం అంతా కళ్ళుతెరిచి చూసింది, చెవులతో ఆ ఘోష వింది. అది చాలు. సమాజం మొత్తం ఒకవేళ చెడుత్రోవ పట్టిఉంటే, మారే అవకాశం ఉంది."

సంఘమిత్ర నవ్వాడు గెలిచినట్లు. "ఇహ మీరు ఒకప్పుడు వర్షాలు రావాలని ఇచ్చిన నరబలికి, దీనికి తేడా ఏమిటి?" గొంతులో కొద్దిగా హేళన జతకూర్చిన ఛాయ.

ప్రశాంత్ చికాకు అధికమయింది. "వాటికి మూఢనమ్మకాలు బేసిస్. ఫలితం ఎక్కడా గ్యారంటీ లేదు. వాటితో దీన్ని పోల్చడం అన్యాయం." సంఘమిత్ర ప్రతిఘటించాడు, "ఇక్కడ మాత్రం గ్యారంటీ ఏమిటి. చదివిన వారు, ఇది ఒట్టి కథేనని మర్చిపోతే, ఒక ప్రాణి నాశనంగావడం తప్ప..." ప్రశాంత్ మొహంలోకి చూస్తూ చాలా మెల్లిగా అన్నాడు.

"అంతెందుకు" కుమార్ అందుకున్నాడు. "ఈ ఆర్గుమెంట్‌కి సంబంధించిన కథ ఒకటి ఈ మాగజైన్‌లో పడింది. ప్రశాంత్ నువ్వు ఒకసారి చదివి, ప్రొఫెసర్ గారికి ఇవ్వు. తరువాత తీరికగా వాదనలోకి మళ్ళీ దిగవచ్చు." మ్లానమైన సంఘమిత్ర మొహం చూడకుండానే చెప్పుకు పోతున్నాడు కుమార్.




"ఎక్స్క్యూస్ మీ. ఇవాళ మీరు ఏమి తీసుకుంటారు?" సంఘమిత్ర లేచి నిల్చొని అడిగాడు.

"కూల్ డ్రింక్స్ చాలు సార్. అవి కూడ సాఫ్ట్ డ్రింక్స్. నిన్న యింట్లో గొడవపెట్టేశారు వాసన అన్యాయంగా వస్తోందని," కుమార్ పెద్దగా నవ్వి సిగ్గుపడ్డాడు రెస్పాన్స్ లేకపోవడం గమనించి. ప్రొఫెసర్ కిటికీలోనుండి బయటికి చూస్తున్నాడు. ప్రశాంత్ కథ మొదలుపెట్టేశాడు. అతని కళ్ళు ఆసక్తిగా పరుగెడుతున్నాయి ప్రింటెడ్ మేటర్‌పై.

* * *

ఊటీ,
13-4-1973

మై డియర్ ప్రొఫెసర్ మొగుడుగారూ,

ఇక్కడ మేము బ్రహ్మాండంగా వున్నాం. పోతే రాత్రంతా మీరు కల్లో వచ్చి గొడవపెడుతున్నారు అంతే. వెధవ రోగం, నాకే రావాలా అన్పిస్తూంటుంది ఒక్కోసారి. హాయిగా మీరు నా ఒళ్ళో పడుకొని, వెన్నెల రాత్రి, మన రూఫ్ గార్డెన్‌లో కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ, యుగాలు గడిపెయ్యాలని ఉంది. వస్తుందిలే ఆ సమయం, అప్పటి వరకూ "ఎంత ఎంత ఎడమైతే అంత తీపి కలయిక" అని పాడుకుంటూ కూర్చోంది. ఈవేళ నన్ను పరీక్షించి డాక్టర్ ఆశ్చర్యపోయాడు. ఏవన్నాడో తెలుసా? "మీకు సైకలాజికల్ రిలీఫ్ అమ్మా! చాలా బాగా సహకరిస్తున్నారు మీరు మాతో. రోగి వైద్యునితో చెయ్యి కలిపినపుడు రోగం చెదిరి పారిపోతుంది. ఇంకో ఆరు వారాల్లో మీరు యింటికి వెళ్ళిపోవచ్చునేమో." చూశారా

శ్రీవారూ, డాక్టర్ ఎంత పిచ్చివాడో. తన మందులు పనిచేస్తున్నాయి అనుకుంటున్నాడు. కానీ నాకు బ్రతకాలని వుంది సార్. నాకోసం కాదు. మనకోసం. నేనొకదాన్ని ఏం బతుకుతాను సార్, అది అనర్థం, రుచిలేని జీవితం. మీతో వుంటే ఓహ్, భువిపై దివిని దర్శించగలను. బొత్తిగా సిగ్గులేదేంటి మా అవిడకి, అని ముక్కున వేలువేసుకుంటున్నారా ? సిల్లీ మాన్! మీతో నాకు సిగ్గేంటి సార్, మన ఇద్దరం ఒకటి. సిగ్గుపడితే, నాతో నేను సిగ్గుపడ్డట్టే.

ఇక్కడ ఊటీలో వాతావరణం చాలా బావుంటుంది సార్. మనం, మీకు తీరికయినపుడు ఇక్కడ ఓ బ్రహ్మాండమైన లొకేషన్ చూసుకొని సెటిల్ అవుదాం. ఇంకో విషయం తెలుసా, ఇక్కడ, ఈ టైమ్‌లో కూడా, కొద్దిగా చలిగా ఉంటుంది. ఆ చలిలో ఓ చిన్న యిల్లు. ఆ యింట్లో ఓ ప్రొఫెసర్, ఓ మిసెస్ ప్రొఫెసర్. అంతే! ఇంకేం కావాలి సార్ అంతకన్నా ?

మై గుడ్‌నెస్, మర్చేపోయా! మీరు ఎలా వున్నారు ? వంటా అదీ బాగానే చేసుకుంటున్నారా ? లేకపోతే నేను చెక్ చేసేందుకు లేనుకదా అని హోటల్ కూడు లాగించేస్తున్నారా ? ఇదిగో, నే వచ్చేప్పటికి వంటింట్లో పెట్టి వెళ్ళిన సామగ్రి అంతా అయిపోకపోతే, మీరు బయట తిన్నట్లు లెక్క. అప్పుడు మిమ్మల్ని కొన్ని రోజులు భోజనం పెట్టకుండా మాడ్చెయ్యగలను జాగ్రత్త. ఖబడ్దార్!

నర్స్ లైట్లు తీసెయ్యమని ఒకటే ఏడుపు. అంతా రెగ్యులర్ ఇక్కడ. మీకు నేర్పిస్తాలెంటి కొన్ని గుడ్ హాబిట్స్ అక్కడికి కొచ్చిన తరువాత. ఖంగారు పడకండి, అంతా సరదాగానే ఉంటుంది. హ్((. (ఇది అవలింత) ప్ప్చ (ఇది ము....) గుడ్‌నైట్.

మీ కౌసల్య.

* * *

హైదరాబాదు,
17-4-73

కౌసల్యా డార్లింగ్,

నీ లెటర్ అంది 22 సెకన్లు అయింది. ఎంత గుడ్ న్యూస్ చెప్పావు నీ ఆరోగ్యం గురించి; ఇప్పుడెలాగుంది డియర్ ? అబ్బా! విన్నాదిలి ఇంకా 6 వారాలు!

ఇక్కడ ఆఫీసు పని ఎక్కువైంది. మే రెండో వారంలో నేను ఊపిరి పీల్చుకోడానికి కొద్ది వ్యవధి దొరుకుతుంది. అప్పుడు దేవిగారి ముందు వాలడానికి ప్రయత్నం చేస్తా. అన్నట్లు ఎదురింట్లో కొత్తవాళ్ళు ఎవరో దిగారు. ఓ అమ్మాయుంది, 24 ఏళ్ళు ఉండచ్చు. చాలా అందంగా ఉంది. స్మైల్ కొడితే, మాట్లాడకుండా లోపలికి పరుగెత్తింది.

ఏవిటో, అమ్మాయిలు మరీ వెనకబడి పోతున్నారు; వుంటా డియర్.

నిర్మల్.

* * *

ఊటీ.
21_4_73

ప్రొఫెసర్ మొగుడుగారూ,

మీ వంద పేజీల లెటర్ అందింది. బుద్ధి లేకపోతే సరి. అయినా, ఒక్కతీ ఇక్కడ లెటర్ కోసం కళ్ళుచించుకు ఎదురుచూస్తూ ఉంటుంది అనే జ్ఞానం అక్కరలేదూ? ఏం వ్రాయాలో తెలీదు అంటారా, పైగా! మీ యిష్టం సార్, ఇవాళ వంట నుండి మీరు చూసిన సినిమా కథ వరకు, ఏదైనా ఓ రెండు మూడు పేజీలకు తక్కువ కాకుండా వ్రాయండి. మీకు తెలీదండి, మీ writing చూస్తే నా కొచ్చే రిలీఫ్. మీ లెటర్ని అలా గుండెలమీద పెట్టుకుని పడుకుంటే, మీరే నా వద్ద ఉన్నారూ అనిపిస్తుంది. అది చాలు, నేను త్వరగా కోలుకోడానికి. అసలు టి. బి. వ్యాధికీ, రోగి సహకారం చాలా ముఖ్యం. మీరు గనుక ఈసారి లెటర్ సరిగ్గా వ్రాయక పోతే, నేను కోఆపరేట్ చెయ్యను డాక్టర్తో. ఆఁ!

అన్నట్టు ఓ భార్యని సానిటోరియంలో పడేసి ఎవరో అమ్మాయి దగ్గర బ్రహ్మ చారి పోజులు కొడతారా? జాగ్రత్త, ముందే ఆ అమ్మాయికి చెప్పండి, కౌసల్యా అనే లంఖిణి ఉందని, తన సొత్తుమీద కన్ను వేస్తే గుడ్లు పీకేస్తుం దనీ! మీ ఆరోగ్యం ఎలా ఉంది సార్? రాత్రిపూట పాలు త్రాగుతున్నారా? పెద్ద లెటర్ వ్రాయండి, నాకు ముద్దులు కురి పిస్తూ-

కౌసల్య.

* * *

హైదరాబాదు,
25_4_73.

డియర్ కౌసల్యా,

సారీ గాల్, చిన్న లెటర్ వ్రాసి నందుకు! కానీ టైమ్ బొత్తిగా లేదు. నీ ఆరోగ్యం బావుందనుకుంటాను.

అన్నట్టు మనింటిముందు దిగిన అమ్మాయి పేరు అన్నపూర్ణ. బావుంది కదూ. పేరు కన్నా అమ్మాయి ఇంకా బావుంటుంది. అసలు వర్ణిద్దామని ఉంది కానీ, నా భాష సరిపోదు. ఇప్పుడిప్పుడు కొద్దిగా నవ్వుతోంది, పలకరింపుగా. మొన్న వాళ్ళింటికెళ్ళి పలకరించివచ్చాం. నాకు పెళ్ళయిన మాట చెప్పలేదనుకో (హఁ హఁ హఁ). పాపం, ఆ అమ్మాయి మూగదట. "మూగవయితే నేమి" అన్నట్టు, కుందనపు బొమ్మ. ఎవరు కట్టుకుంటారో అదృష్టవంతులు. ఆ అణుకువ, ఆ భీతహరిణి చూపులు.... ఓహ్! చాలా చాలా బావుంటుంది. నిన్న వాళ్ళింటికి భోజనానికి వెళ్ళా. ఆ అమ్మాయే వడ్డించింది. నీకు మల్లేనే,

తెల్ల చీర కట్టుకొని, మల్లెపూలు పెట్టుకుంది. పోతే, పెరుగుగిన్నె నా కంచంలోకి వదిలేసింది, నాకు పెరుగు ఇష్టమని తెలిసినట్లు. సిగ్గులేకుండా మొత్తం తినేశా. రైట్, ఇక వుంటా.

నిర్మల్.

* * *

ఊటీ,
29-4-73

డియర్ ప్రొఫెసర్,

మీ ఉత్తరం అందింది. అసలు అర్జంటుగా అక్కడి కొచ్చేసి ఆ అమ్మాయికి చెప్పేదా మనుకుంటున్నా, నేనున్నానని. అయినా మీరేవిటి, అయ్!

నేను బ్రహ్మాండగా ఉన్నాను. కానీ క్రిందటి వారం మీద, ఇప్పటికి ఎవీ ప్రోగెస్ కాలేదు అని డాక్టర్ తిట్టాడు. నే నేమన్నానో తెలుసా? "సరే డాక్టర్! సరిగ్గా నెల రోజుల్లో మీరే నన్ను డిస్‌చార్జ్ చేస్తారు చూసుకోండి," నవ్వుతూ చాలెంజ్ చేస్తే, "నీ ధైర్యం అందరికీ ఉంటే మా తలనొప్పి చాలా మటుకు తగ్గేదమ్మా" అనేసి వెళ్ళిపోయాడు.

మీరు ఎలా ఉన్నారు ప్రొఫెసర్? బరువు ఏమన్నా తగ్గారా? అయినా ఈ మధ్య కొద్దిగా కొవ్వు చేరిందిలెండి. ఓ మూడునాలుగు కిలోలు తగ్గితే మా రాజావారు ఇంకా అందంగా ఉంటారు. నేవచ్చేటప్పటికి waist line ఒకఇంచీ తగ్గించు కోండి. ఇహ మన్మధుడి ఉద్యోగం మీకు పడెయ్యొచ్చు.

అబ్బ! ఇంకో నెలరోజుల్లో ఈ హాస్పిటల్‌కి స్వస్తి చెప్పవచ్చు. మీ ఒళ్ళో తలపెట్టుకు పడుకుంటా సార్ అక్కడికొచ్చిన మొదటిరోజు. మరి ఉంటా, నర్స్ గొడవ భరించలేం.

కౌసల్య.


* * *

హైదరాబాదు,
3-5-73.

కౌసల్యా,

ఇక్కడ నేను బాగానే ఉన్నాను. గత రెండు రోజులుగా పని తగ్గింది. హాయిగా ఇంట్లోపడి ఉంటున్నా. అన్నట్టు నిన్న సాయంకాలం అన్నపూర్ణని మనింటికి రమ్మన్నా. వచ్చి నాకు వంటచేసి పెట్టింది. అంతా నీ వంటే, నువ్వు వడ్డించినట్లే వడ్డించింది. చాలా రోజుల తరువాత కడుపునిండా భోజనం చేశా. అదేవిటోగానీ కౌసల్యా, అందరు ఆడవాళ్ళు ఒక ఎత్తు, అన్నపూర్ణ ఒక ఎత్తు.

నిన్న రాత్రి ఇద్దరం సినిమాకి వెళ్ళాం. సినిమా బోర్. హీరో భార్యని మరచి ఇంకో అమ్మాయితో తిరగడం, హీరో భార్య ఆత్మహత్య చేసుకోవడం, హీరో మారిపోయి రెండు సీరియస్ పాటలు పాడి సన్యాసుల్లో కలిసిపోవడం, ఇదీ థీమ్. అసలు మన సినిమాల




స్టాండర్డ్ పడిపోయింది. ఏదో టైమ్ గడిచిపోతుంది కదా అని వెళ్ళిన నాకు అన్నపూర్ణ సాంగత్యం చాలా ఆనందం ఇచ్చింది. సినిమా చూడడం మానేసి, ఆమెతో కబుర్లు చెబుతూ కూర్చున్నా. మధ్యమధ్యలో మరీ బావుండదని సినిమా చూశాననుకో. ఏవిటి, మూగదానితో ఏం మాట్లాడావనా? నిజమే, బదులు రాదు మనకి, మాటల రూపంలో. ఏవిటో ఆ అమాయక మోములో ఓ రకమయిన బాధ, భయం కనబడుతాయి. అవేనేమో నన్ను ఆమెకి దగ్గరచేసింది. ఆ బాధని దూరం చెయ్యా 'నిపిస్తుంది. అందుకే ఎన్నో జోక్స్ చెప్పా. విచిత్రవేవిటంటే ఆమెకి మన మాటలన్నీ వినబడతాయి. పకపక నవ్వుతుంటే, మాస్తూ కూరో` వాలనిపిస్తుంది. నిన్న రాత్రి సినిమా బాగాలేకపోయినా, ఆనందంగా గడిపా. ఈ వేళ ఆఫీస్‌కి సెలవుపెట్టి ఇద్దరం గండిపేటకి వెళ్ళాం. ఆమెకి తెలియకుండానే చాలా దగ్గరయాను.

నిర్మల్.

• • •

ఊటీ
12-5-73.

మైడియర్ ప్రొఫెసర్,

మీ పెద్ద ఉత్తరం (అన్నపూర్ణతో చేసిన అడ్వెంచర్స్ వర్ణన) అందింది. ఇక్కడ నా హెల్త్ ఫరవాలేదు కానీ, ప్రొగ్రెస్ లేదు. ఒక్కసారి మిమ్మల్ని చూడాలని ఉంది, రాగలరా,

కౌసల్య.

* * *

హైదరాబాదు,
21-5-78

కౌసల్యా,

ఎలా మొదలుపెట్టాలో తెలియని పుత్తరం ఇది. కానీ, నిజం దాచను. అన్నపూర్ణ నాకు చాలా దగ్గరయింది అని భయపడ్డా. నిన్న నిన్ను చూడ్దామని బయలుదేరా. 18, 19 తారీకులలో ఆమెకి కనబడలేదు నేను. కావాలని దూరంగా వచ్చా నేను బయలుదేరే ముందు పావురాలిలా చూసుకు వచ్చింది. ఆమె కళ్ళలో సిగ్గు, అభ్యర్థన. చలించాను. చేతిలో ఏదో కాయితం చూసి, తీసుకున్నాను. కళ్ళు తిరిగాయి. అందులో ఏముందో తెలుసా కౌసల్యా! "ఐ లవ్ యూ! మీరు కాదంటే ఆత్మహత్య చేసుకుంటా" క్షణంసేపు ఏమీ పాలుపోలేదు. అన్నపూర్ణ వంకచూస్తే నా నిర్ణయంకోసం ఆశగా చూస్తోంది. నేను అవునంటే ఆ అమాయక మొహం వెలిగిపోతుంది, కాదంటే ఆ అందం మొద్దకలిసిపోతుంది. నాలుగు రోజులు టైమ్ అడిగా. ఏంచెయ్యాలో తెలీడం లేదు. కానీ, నిజం ఏమిటంటే, నాకు తెలీకుండానే, అన్నపూర్ణ అంటే యిష్టం ఏర్పడింది. నువ్వు ఈ సమస్య నాకోసం పరిష్కరించు కౌసల్యా. నా మనస్సు చప్పబడిపోయింది. ఒక మూగపిల్ల జీవితం నందనవనం చెయ్యాలనుకుంటే ఓ పూజారి జీవితంలో నిప్పులు పోయాలి. కాదంటే, నేను చేసిన తప్పువల్ల (నేను చెప్పలేదు కదా, నాకు పెళ్ళయినట్లు) ఓ అమాయక మూగజీవి ప్రేమాప్యాయత లకు నోచక మరణిస్తుంది. ఇహ నీ నిర్ణయం కౌసల్యా!

నిర్మల్.

* * *

ఊటీ,
25-5-1978

నిర్మల్ బాబూ,

నా జీవితంలో ఎప్పటికీ సంతృప్తి కరమైన జవాబు ఇయ్యలేని ప్రశ్న వేశారు. నేను మీకు దూరం అవడం, నాకు ప్రాణం పోవడంతో సమానం. కానీ నేను కాదు అంటే, మీరన్నట్టు "ఒక అమాయక మరణిస్తుంది," ఆ మాట చాలండీ నా నిర్ణయం తీసుకునేందుకు. కానీ, నిర్ణయం చెప్పేముందు కొన్ని విషయాలు చెప్పాలండీ.

ఓరోజు మీరు నేను పార్కులో కూర్చొని ఉండగా మీ మరదలు పిల్లపై జోక్ వేశారు గుర్తుందా? అప్పుడు ఎలా ఉంటుంది మీ మరదలు అని నే నడిగితే "నీకన్నా బెటర్" అన్నారు నవ్వుతూ. నన్ను ఉడికించి ఆనందంతో చప్పట్లు కొట్టారు. అది అవడానికి చిన్న సంఘటన అవ్వచ్చు. కానీ కొద్దిగా జాగ్రత్తగా ఆలోచించండి. ఒక నిజం విదితమౌతుంది మన మిద్దరం భార్యాభర్తలం కావచ్చు. అయినా, జీవితంలో

అన్నీ కలిసి పంచుకుందాం అని పెళ్ళిలో ప్రామిస్ చేసుకొని కూడా, పంచుకుంటూ ఉన్నా, కొన్ని సెన్సిటివ్ స్పాట్స్ ఉంటాయి. భార్యకి భర్తపై నమ్మకం, భర్తకి భార్యపై నమ్మకం, ఇవన్నీ వట్టి మాటలేనండీ. నన్ను మీరు నమ్మారు అని ఈ క్షణంలో మీరు అనవచ్చు. కానీ, మీరు యింట్లో లేనప్పుడు మా బావ నాలుగుసార్లు మన యింటికొస్తే మీ నమ్మకం ఉంటుందా? మీ కిష్టమేనా? ఆ నిస్పృహయతలో నాపై కోపం చూపించవచ్చు.లేదా మీలో మీరు కుమిలి పోవచ్చు.

అది నమ్మకం లేకపోవడం కాదు సార్. మనిషిమీద ప్రేమ ఎక్కువైన నాడు, ఇది నా సొత్తు అనే ఫీలింగ్ వస్తుంది. అసలు ఆ ఆలోచన హృదయాన్ని ఎనలేని హాయితో నింపివేస్తుంది. అప్పుడే, ఆ మనిషి మనకి కాకుండా పోతారేమో అనే ఆందోళన మొదలయి దాని నుండి ఈర్ష్య ఉద్భవిస్తుంది. అది సహజ మానవ ప్రవృత్తి. దీనికి అవరోధం కల్పిస్తే వచ్చేది మరింత నిస్పృహయత, ద్వేషాగ్ని.

మిమ్మల్ని ఎంతగా ప్రేమించానంటే, మీ కంపెనీ ఇంకొకరికి, అందునా నా జాతివారికి ఒక్క క్షణం ఇవ్వాలంటే కష్టం అనిపించేది. కానీ చదువుకున్న దాన్ని కాబట్టి ప్రవర్తన మలుచుకున్నా. ఈ వేళ మీ కంపెనీ ఇంకొకరికి శాశ్వతంగా ఇవ్వాలా వద్దా అనే నిర్ణయం తీసుకోవన్నారు. మీ సుఖమే నా సుఖమనుకొని మీ ఆనందానికి అడ్డుపడకుండా దూరం జరిగిపోయి మీరు అన్నపూర్ణగారితో ఆనందంగా వుంటే అందులో నుండి నేను ఆనందం పొందడం నిజమైన ప్రేమ కాదు. అది చేతగానితనం. నేను సుమతిని కాను, సీతనూ కాను. మిమ్మల్ని వదులుకోలేను. ఈ సంఘటన తరువాత ప్రేమించనూ లేను. అలా అని మీకు అడ్డుపడి నా చేతుల్లోనుండి మీరు జారిపోకుండా చూసుకుంటే మీకు నేనేదో అన్యాయం చేశాననే ఆలోచన మీలో ఉండిపోతుందేమో। ఆ తరువాత మీతో నేను చేసే కాపురం నేను ఊహించదల్చుకోలేదు. మీరు సాధారణ మనుష్యులు. నేను అంతకన్నా సాధారణమయిన స్త్రీని. నాకు కాకుండా పోయే మిమ్మల్ని ఆపదల్చుకోలేదు. అయితే, అన్నపూర్ణగారికోసం మీరేదో త్యాగం చేస్తున్నట్టు బిహేవ్ చేసి ఆమెని కించపరచకండి. అన్నపూర్ణగారు అనాకారి అయితే, మీరు నిర్ణయం తీసుకోవడంలో నా సహాయం అవసరం ఉండేది కాదు. పిచ్చి ప్రొఫెసర్! మనిషి త్యాగం చెయ్యడం చాలా తక్కువ. అందునా ఓ అమ్మాయిని వివాహం చేసుకోవడంలో త్యాగం అసంభవం. స్వార్థానికే త్యాగం తొడుగు తొడుగుతారు అందులో.

29న నేను డిస్చార్జ్ అవ్వాలి అను

కున్నాను. అనుకున్నట్టే అవుతున్నాను. అయితే కేవలం హాస్పిటల్‌నుండి కాదు, ఈ లోకం నుండే. ఇహ నావల్ల మీ కేం సమస్య లుండవు. తలచుకుంటేే నవ్వు వస్తుంది, మనిషి పరు నిమిషంలో ఏం జరుగుతుందో తెలియక, కొన్ని ఏళ్ళవరకు ప్లానువేసి నిరాశ చెందుతుం టాడు. వచ్చి మీ వళ్ళో పడుకుందాం అనుకున్నా. ఇప్పుడు అది సాధ్యంకాదు అనిపిస్తుంది. బ్రతికుండగా కాకపోయినా (ఈ ఉత్తరం మీకు 29న అందుతుంది. ఆరోజు కౌసల్య వెళ్ళిపోతుంది ) కనీసం పోయినతరువాత ఒక్కసారి నా తలని మీ వళ్ళో పెట్టుకోరూ, Please! ఏయ్ Professor! నా కోరిక తీర్చకపోతే దయ్యం అవుతా జాగ్రత్త. ఐ విష్ యు ఆల్ ది బెస్ట్.

కౌసల్య.

పి. ఎస్. మీ మీద నాకేం కోపంలేదు ప్రొఫెసర్‌గారూ! మీ వెయిస్ట్‌లైన్ జాగ్రత్త, ఒక్క ఇంచీ తగ్గితే, ఎన్న డుడికి

* * *

ఉత్తరం, దాని తరువాత టెలిగ్రాం (కౌసల్యా ఎక్స్‌పైర్డ్. స్టార్ట్ ఇమ్మీడి యట్లీ. డాక్టర్ చంద్ర) చదివిన నిర్మల్ కొయ్యబారిపోయాడు. అనాలోచితంగా, అచేతనంగా తన డైరీతీసి 17-4-1973 పేజీకి తిప్పాడు.

! -4-1973 ఈ వేళ ఒక గమ్మత్తయిన ఆలోచన వచ్చింది. కౌసల్య నేను తనకి కాకుండాపోతానని తెలిస్తే ఎలా రియాక్ట్ అవుతుందో చూడాలని వుంది. నా వ్రాయబోయే కథకి ఇది మంచి ప్లాట్. మెల్లిగా, కౌసల్యకి వ్రాసే లెటర్స్‌లో తనకు దూరం అవుతున్నట్టు వ్రాస్తా! నాకు వచ్చిన ఫలితాన్నిబట్టి ఆడవాళ్ళంతా ఇంతే అనవచ్చా, లేక నా డియర్ కౌసల్య ఒక్కతే వేరా?

కౌసల్యా మై డార్లింగ్! ఇది నీకో పెద్ద పరీక్ష. రచయితని పెళ్ళిచేసు కున్నందుకు కష్టపెడ్తున్నాను. కానీ ఏం చెయ్యను? నీ రియాక్షన్ నా కథకి మూలం, ప్రాణం. ఇది రచనా జగత్తు లోనే మొదటిసారి, చివసారి అవ్వాలి. ఒక రచయిత తన భార్యకి పరీక్ష పెట్టి మెటీరియల్ తీసుకోవడం. నా రచన మానవతత్వ శాస్త్రానికే ఒక కొత్త రూపం ఇస్తుందిరా కౌసల్యా డియర్! కొద్ది రోజులు బాధ నీకు తప్పదు మరి. ఆ తరువాత ఈ రచనలకి, ఉద్యోగానికి స్వస్తిచెప్పి, నువ్వు నేను ఊటీలో ఓహ్! ఆ రోజుకోసం పిచ్చివాడిలా ఎదురుచూస్తున్నా కౌసల్యా! ఈ విషయం నీకు చెప్పినప్పుడు నీ మొహం ఫొటో తీసుకుంటా!

* * *

తల ఎత్తిన ప్రశాంత్ కళ్ళకి కుమార్ సంఘమిత్రలు మసగ్గా కనిపించారు. కనుకొనల్లో నిలిచిన నీటిబిందువులు




ఇహ ఆగలేమంటూ రాలిపడ్డాయి. సంఘమిత్ర చేతిలో రెడ్‌వైన్ గ్లాసు వణుకుతోంది. కుమార్ చేతిలో ఖాళీ డ్రింక్ సీసా!

"ఎంరా ప్రశాంత్, మనం గెల్చినట్లే కదా!" కుమార్ నవ్వుతూ అడిగాడు.

ప్రశాంత్ కళ్ళు ప్రశ్నార్థకంగా చూశాయి. సంఘమిత్ర గొంతు సవరించుకొని, "ఒక్క క్షణం! మీరు ఆ కథని నిన్న చదివారు కానీ, నేను నాలుగేళ్ళ కిందట చదివా! కాబట్టి నేను కూడా వాదనలో ఉన్నట్టే" అన్నాడు.

"వండ్రఫుల్" కుమార్ ఉత్సాహంగా అన్నాడు. "రచయిత ఈ కథలో ఓ ప్రయోగం చేశాడు. ఒక లేని సమస్యలో భార్యని ఇరికించి, ఆమె దాన్ని ఎలా ఛేదించుకొస్తుందీ చూద్దాం అనుకున్నాడు. అతనికి అనుకోని ఫలితం వచ్చినా, మన కొచ్చిన సమాచారం గురించిగూడా ఆలోచించాలి"

సంఘమిత్ర తన సోఫాలో సర్దుకు కూర్చున్నాడు. "మీరు బయటివారు, మీ కొచ్చిన లాభం చూసుకుంటున్నారు గానీ, రచయితకి జీవితంలో వచ్చిన విపత్తు గమనించడం లేదు. ఆ రచయిత భార్య రచయితని ఎంత ప్రేమించిందో ఆమె వ్రాసిన తొలి, తుది జాబుల్లో తెలుస్తోంది. అటువంటి భార్యని, పోనీ ఆడమనిషినీ, అదీ కాదనుకుంటే ఓ మనిషిని, నేరం ఏం లేకపోయినా, తన రచనకోసం స్వార్థపూరితమైన రచయిత అంత హృదయక్షోభ అనుభవించేటట్లు చేశాడు. ఆ అమ్మాయికి 25 ఏళ్ళు అనుకున్నా, ఇంకో 40 ఏళ్ళ జీవితాన్ని మింగి

వేశాడు ఆ రచయిత. అయినా మీరు రచయితనే సపోర్ట్ చేస్తున్నారు" సంఘమిత్ర రుమాలుతో మొహం తుడుచుకున్నాడు.

"ప్రొఫెసర్, రచయిత ఆ అమ్మాయిని టెస్ట్ చేశాడు. అనుకున్న రియాక్షన్ కాక మరేదో వచ్చింది. అది అతని తప్పు కాదు. అది ఆ అమ్మాయి బుద్ధిలేనితనం. ఆత్మహత్యతో ఏం సాధిద్దాం అనుకుంది? అయినా చదువుకున్న వాళ్ళు అలా అజ్ఞానంగా "

"ప్రశాంత్ గారూ!" సంఘమిత్ర దాదాపు అరిచాడు "ఆ అమ్మాయిని వదిలెయ్యండి. అసలే వంట్లో బాగాలేక భర్తకి దూరంగా వుంది. ఆమె ఆలోచనలు అటువంటి పరిస్థితుల్లో అలా ఉండక ఎలా ఉంటాయి మరి?"

"కరెక్ట్! అలా అనండి ఒప్పుకుంటా. రచయిత ఎక్స్‌పెరిమెంట్ చెయ్యడం తప్పు అంటే నాకు వళ్ళు మండుతుంది. ఎక్స్‌పరిమెంట్ కరెక్టే! కానీ సందర్భం తప్పు. టిబితో బాధపడే భార్యకి ఊరట కలిగించే మాటలు చెప్పడంగాక వెర్రివాడిలాగా అప్పుడు తన ప్రయోగం మొదలుపెట్టాడు. దాంతో తిప్పికొట్టింది. దీన్ని ఆధారంగా తీసుకొని మీరు అసలు రచయిత ప్రయోగాలే చెయ్యకూడదూ అనడం హాస్యాస్పదం. ఈ కేస్ వేరు. నేనూ మీతో ఇక్కడ ఒప్పుకుంటా. రచయిత ఓ విధంగా భార్యని హత్య చేసినట్లే. ఎందుకంటే అనారోగ్యంతో బాధపడుతున్న..."కుమార్ ఆగిపోయాడు.

సంఘమిత్ర సోఫాలోనుండి లేచి నుంచున్నాడు. అతని గుప్పెట్లు గట్టిగా మూసుకున్నాయి. "కుమార్ కరెక్ట్‌గా చెప్పాడు. ఐ ఏమ్ ఎ మర్డరర్! భార్యని చేజేతులా చంపుకున్నాను. కౌసల్యా! నన్నుకూడా నీతో ఎందుకు తీసుకువెళ్ళలేదు? ఎందుకు తీసుకెళ్ళలేదు." పిచ్చిగా అరుస్తూ, ఏడుస్తూ లోపలికి పరుగెత్తిన సంఘమిత్రని చూసిన కుమార్ గబగబా మాగజైన్‌లో ఆ కథని మళ్ళీ తిరగేశాడు. "ది ఎక్స్‌పెరిమెంట్, బై ప్రొఫెసర్ నిర్మల్ సంఘమిత్ర" చదివిన కుమార్ కళ్ళలో రెండు నీటిబిందువులు నిలిచాయి. ప్రశాంత్‌కి చూపిస్తూ తల పంకించిన కుమార్ కళ్ళు ఆ నీటి బిందువులనుండి వీడ్కోలు తీసుకున్నాయి.

